క్లుప్తంగా

వృద్ధులకు పాదరక్షల పంపిణీ



వృద్ధులకు పాదరక్షలు పంపిణీ చేస్తున్న వైద్యురాలు వరలక్ష్మి

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పరిధిలోని రాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద వృద్ధులకు పాదరక్షలను వైద్యురాలు ఎం.వరలక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. వృద్ధులకు తన వంతుగా సేవ చేయాలనే తపనతో వారికి పాదరక్షలతో పాటు విసన కర్రలు, మజ్జిగ అందించానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

శరీరానికి తగినంత నీరు అవసరం

కాకినాడ రూరల్: మనిషి శరీరానికి రోజూ తగినంత నీరు అందించాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. జాతీయ హైడ్రేషన్ దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

కరప: తమ కుమార్తె ఆచూకీ 15 రోజులైనా లభించలేదని, కిడ్నాప్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులకు, జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌లకు ఆమె తల్లిదండ్రులు, బంధువులు ఫిర్యాదు చేశారు. ఆ వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి కరప వచ్చి స్థిరపడ్డాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నాయి. స్థానిక పాఠశాలలో చదువుతున్న పెద్దమ్మాయి (15)ను తమ ఇంటి పక్కనే ఉండే బుద్దాల చిన్నారావు కుమారుడు షణ్ముఖ మణికంఠ (23) ఈ నెల 8న తీసుకెళ్లిపోయాడని బాధితులు ఆరోపించారు. ఈ విషయాన్ని అదేరోజు రాత్రి కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఇంతవరకూ తమ కుమార్తె ఆచూకీ తెలియ రాలేదన్నారు. ఆ వ్యక్తి తమ కుమార్తెను చంపేస్తాడేమోనని భయపడుతున్నామని బాధిత తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

పలువురికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో 9 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 11 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో 20 మందిని హాజరుపర్చగా వారికి పైవిధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

భీమేశ్వరా... సర్వేశ్వరా



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. జేష్ఠ మాసం త్రయోదశి కావడంతో ఆలయంలో స్వామి, అమ్మవార్లకు, ఉప ఆలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయానికి తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో భారీగా భక్తులు వేచిఉన్నారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర ప్రసాదంగా, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శెనగలు, పులిహోర ప్రసాదంగా అందించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం, గొంచాల, పీబీ దేవంలలోని శివాలయాల్లో పూజలు జరిగాయి.

జూదరుల అరెస్ట్

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ శివారులో జూదమాడుతున్న ఎనిమిది మందిని సోమవారం అరెస్ట్ చేసినట్లు గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అక్కడకు వెళ్లి దాడి చేయగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.32,260 స్వాధీనం చేసుకున్నామన్నారు.

నీరుంతరం ఇంతే!

- ప్రతి అడుగూ మడుగులోనే..
- చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి ముంపునీరు
- డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ఇబ్బందులు



రమణయ్యపేట చేపల మార్కెట్ వద్ద రోడ్డు పక్కనే నిలిచిపోయిన మురుగు



వలసపాకల గ్రామ గంగరాజునగర్ రోడ్డు నంబరు-4 వద్ద సంతోష్‌నగర్‌లో ఇలా..



రమణయ్యపేట - వలసపాకల మార్గంలో శ్రీకన్వెన్షన్ ఫంక్షన్ హాలు ప్రధాన రోడ్డు వద్ద..

కాకినాడ రూరల్: ప్రతి అడుగు... మురుగు మడుగుల్లోంచే పడుతోంది. చిన్నపాటి వర్షానికి నీరెళ్లే దారిలేక ప్రతి రోడ్డూ ముంపుమయం అవుతోంది. వర్షాకాలానికి ముందే డ్రైనేజీల్లో పూడికలు తొలగించకపోవడం ఒక సమస్య అయితే, ఎక్కడికక్కడే కాలువలు ఆక్రమణలతో బక్కచిక్కడం మరో సమస్య, అంతేకాకుండా చాలా చోట్ల కాలువలే లేకపోవడం ఇంకో కారణం. ఏదేమైనా వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులకు నిలయంగా పరిసరాలు తయారవుతున్నాయి. కాకినాడ రూరల్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్లపై వర్షపునీరు నిలిచిపోతుంది. ఎక్కడ నీరు అక్కడే అన్న చందంగా ఉండడంతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. కొన్నిచోట్ల డ్రైనేలు ఆక్రమణలతో మూసుకుపోగా, మరికొన్ని చోట్ల రోడ్లపై నీరు డ్రైనేజీల్లోకి వెళ్లేలా మార్గం ఉండడం లేదు. ఫలితంగా రోడ్డుపై, మార్జిన్ల వద్ద వర్షపు, మురుగు నీరు చేరుతోంది. వర్షం వస్తున్న సందర్భంలో ఆ నీరు కాలువల నుంచి లాగక, మురుగు కూడా రోడ్డుపైకి చేరి అపరిశుభ్రత నెలకొంటుంది. వలసపాకల గ్రామ గంగరాజునగర్–4 రోడ్డు సంతోష్‌నగర్‌లో సిమెంట్ రోడ్డు కొద్దిపాటి వానకే నీటిమడుగులా మారుతుంది. ఈ గ్రామంలో డ్రైనేజీలు ఆక్రమణలకు గురయ్యాయి. ఈ తంతు యథేచ్ఛగా జరుగుతున్నా పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. రమణయ్యపేట గ్రామంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ గ్రామ పరిధిలో కూరగాయల మార్కెట్‌ను ఆనుకుని ఉన్న చేపల మార్కెట్ వద్ద మురుగునీరు రోడ్డు పక్కనే నిలిచిపోతుంది. డ్రైనేజీల నుంచి నీరు పోయే మార్గం లేక స్థానికులతో పాటు ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వేలాది మంది ఇబ్బంది పడుతున్నారు. ఆ మడుగులోంచే దుర్గంధం మాటున ప్రయాణించాల్సి వస్తోంది. ఎప్పటి నుంచో ఈ సమస్య ఉన్నప్పటికీ ఇప్పుడు వర్షాకాలం కావడంతో కొద్దిపాటి చినుకులకే మురుగునీరు పెరిగి మరింత దుర్గంధం వెదజల్లుతోంది. ఈ రోడ్డులో శ్రీకన్వెన్షన్ ఫంక్షన్ హాలు సమీపంలో బీటీ రోడ్డుపై కూడా నీటి మడుగులా మారుతోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.

ఎవరూ పట్టించుకోక..



రమణయ్యపేట చేపల మార్కెట్ ప్రాంతం కాకినాడ ఒకటో డివిజన్‌లోకి వస్తోంది. అటు పంచాయతీ, ఇటు కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. చేపల మార్కెట్ వద్ద మురుగు నీరు పోయే మార్గం లేక రోడ్డు పక్కనే నిలిచిపోయి కంపు కొడుతుంది. ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదు. మురుగు సమస్యను పరిష్కరించాలి.

– కె.నాగేశ్వరరావు, రమణయ్యపేట, కాకినాడ రూరల్

మురుగునీరు పారేలా చూడాలి



వర్షాలకు పారిశుధ్య సమస్య పెరుగుతోంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటి బారిన ప్రజలు పడకుండా ఉండాలంటే గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం నెలకొల్పాలి. డ్రైనేజీల నుంచి మురుగునీరు సక్రమంగా పారేలా చూడాలి. అంతేకాకుండా పారిశుధ్య పనులు పక్కాగా చేయాలి. రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి.

– నురుకుర్తి రామకృష్ణ (కిట్టు), జెడ్పీటీసీ, కాకినాడ రూరల్

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

బోట్‌క్లబ్: రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు జూలై 1 నుంచి మూడు నెలల పాటు ఉచిత యోగా, స్పోకెన్ ఇంగ్లిషు శిక్షణ ఇస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిగురు యోగాపీఠం వ్యవస్థాపకుడు సచ్చిదానందయోగి ఆధ్వర్యంలో యోగా తరగతులు, జె.అరవింద్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిషు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 18 ఏళ్ల నిండి పదో తరగతి ఉత్తీర్ణులై, తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలకు ఈ శిక్షణ ఇస్తామన్నారు. మొదట 50 మంది ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు 91826 60025 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సంప్రదాయాలను గౌరవించాలి

బోట్‌క్లబ్ : భారత దేశ సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు, మతాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ ఖదీర్ పిలుపునిచ్చారు. స్థానిక ఓ హోటల్‌లో సోమవారం ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఆధ్వర్యంలో భిన్నత్వంలో ఏకత్వంపై ప్రజా సంఘాలతో సమావేశమయ్యారు. నేటితరం యువత మన సంప్రదాయాలు, మతాలను గౌరవించే దిశగా మిల్లి కౌన్సిల్ కృషి చేస్తుందన్నారు. ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండ జవహర్ అలీ, నాయకులు షేక్ నిజాముద్దీన్, ఖాన్, డాక్టర్ మహ్మద్ ఆలం, సయ్యద్ షఫీవుల్లా, షాహిదుల్లా షరీఫ్ పాల్గొన్నారు.

వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

బోట్‌క్లబ్: ఉద్యోగుల బదిలీల్లో హేతుబద్ధీకరణకు సంబంధించిన జీఓలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీఓలకు సంబంధించి పలు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. పట్టణ ఉద్యోగులను మండలాలకు బదిలీ చేయకుండా స్థానిక వార్డులకు బదిలీ చేయాలని కోరారు. మిగులు సిబ్బందిని ఎలా గుర్తించి నిర్వహిస్తారనే దానిపై జీఓలో స్పష్టత లేదన్నారు. పారదర్శక ప్రమాణాలు లేకుండా డిప్యుటేషన్లు జరగవచ్చనే ఆందోళన ఉందని, పూర్తి హేతుబద్ధీకరణతో మార్గదర్శకాలు జారీ చేసిన తర్వాత మాత్రమే బదిలీలను ప్రారంభించాలన్నారు. చాలామంది ఉద్యోగులు ఐదేళ్లకు పైగా సర్వీస్ పూర్తి చేసి పదోన్నతి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. బదిలీలు ప్రారంభించే ముందు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, ఇంక్రిమెంట్‌లు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలని కోరారు. రెండు రోజుల్లో స్పష్టత ఇవ్వకుంటే ఉద్యోగులు పెన్–డౌన్, సమ్మెలు వంటి శాంతియుత నిరసన చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వార్డు సెక్రటరీలు, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



రమణయ్యపేటలో ప్రచారం చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది

కాకినాడ రూరల్: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ రమణయ్యపేట ఆంజనేయ నగర్ అంగన్‌వాడీ కేంద్రం 173 ఆధ్వర్యంలో సిబ్బంది కరపత్రాల ద్వారా సోమవారం ప్రచారం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి, అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ వై.లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆట పాటల ద్వారా పిల్లలకు చదువు చెప్పడం అంగన్‌వాడీ కేంద్రాల్లోనే జరుగుతుందన్నారు. మూడేళ్ల నుంచి నాలుగేళ్ల వయసు పిల్లలకు ఆటపాటలతో పాటు చదువు చెప్పడం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, భవాని, పద్మావతి, ఆయాలు గౌరీ, దేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బిక్కిన విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్: దేశ సమగ్రతకు దివంగత డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పాటుపడ్డారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఉద్యమ స్ఫూర్తితో ముఖర్జీ జనసంఘ్‌ను స్థాపించి గొప్ప జాతీయవాద పార్టీగా తయారు చేశారన్నారు. నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, చోడిశెట్టి రమేష్‌బాబు, జ్యోతుల రాజేష్, గోడి సత్యవతి, చక్కా రమేష్, గౌతు చిన్న పాల్గొన్నారు.

కరప: పెనుగుదురులో జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుట్టా వీరప్రసాద్‌గాంధీ మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన నిస్వార్థ దేశభక్తుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అందరికీ ఆదర్శమన్నారు. నాయకులు వి.చలపతి రావు, పి.అప్పారావు, పి.వెంకటరమణ, ఎస్.నాగేశ్వరరావు, ఎ.మాధవి, పి.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ము తక్షణమే జమ చేయాలి



తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

తాళ్లరేవు: గత మే నెలలో విక్రయించిన ధాన్యానికి ఇప్పటి వరకు డబ్బులు జమ చేయలేదని, దీనిపై తక్షణమే పాలకులు స్పందించాలని కోరుతూ రైతులు ధర్నా నిర్వహించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు, కౌలుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా చేసారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు టి.ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలతోపాటు ప్రధానంగా పి.మల్లవరం గ్రాంటు గ్రామానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు ధాన్యం డబ్బులు జమ అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పులు చేసి సాగు చేస్తున్నారని, ప్రభుత్వం తాత్సారం చేస్తే వడ్డీలు పెరిగి రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతారన్నారు. రైతు మేడిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత మే నెలలో సీఎంఆర్ ద్వారా ధాన్యం తూకం వేశామని, 50 రోజుల గడుస్తున్నా డబ్బులు వేయలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రస్తుతం విత్తనాలు కొనుక్కునేందుకు కూడా అప్పు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తక్షణమే అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు..



ఒలింపిక్ రన్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ క్రీడా మైదానంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూద ఏథెన్స్‌లో ఒలింపిక్ క్రీడలు ప్రారంభానికి సూచనగా ప్రతి ఏడాది జూన్ 23ను అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది జిల్లాలో 8 ప్రాంతాల్లో ఒలింపిక్ రన్‌ను నిర్వహించామని తెలిపారు. వందల సంఖ్యలో విద్యార్థులు, క్రీడాకారులు ఈ రన్‌లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారన్నారు. ఒలింపిక్ సంఘ కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో మినీ ఒలింపియాడ్ పోటీలు కూడా నిర్వహించనున్నామని తెలిపారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం కర్రి భామిరెడ్డి ఒలింపిక్ రన్ జ్యోతిని వెలిగించారు. ఒలింపిక్ సంఘ చైర్మన్ చంద్రు గోవిందరాజు, సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డిలు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడా మైదానం నుంచి జేఎన్టీయూకే వరకూ, తిరిగి జేఎన్టీయూకే నుంచి డీఎస్‌ఏ వరకూ రన్ కొనసాగింది. ఇందులో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘ ఆర్గనైజింగ్ కార్యదర్శి రవిరాజు, ఉపాధ్యక్షులు బి.అర్జున్‌రావు, వై.బంగార్రాజు, సభ్యులు కృష్ణమూర్తి, భాస్కర్, పీడీలు వర్మ, జార్జి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరరావు, డీఎస్‌ఏ కోచ్‌లు సతీష్‌కుమార్, సురేష్, సమీర్, నాగేంద్ర, రుద్ర తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి (గెస్ట్) అధ్యాపకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27న కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, హిస్టరీ, 28న స్టాటస్టిక్స్, పొలిటికల్ సైన్స్, బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, 30న మ్యాథ్స్, ఫిజిక్స్, బోటని, జువాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్, జూలై 1న పీజీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలటికల్ కెమిస్ట్రీ, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరీ సైన్స్ అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 96520 23082 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

కొట్లాటపై పరస్పర ఫిర్యాదులు

కరప: కొరిపల్లిలో రెండు వర్గాల మధ్య కొట్లాటపై పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారని కరప ఎస్‌ఐ టి.సునీత తెలిపారు. ఫిర్యాదుల్లో పేర్కొన్న వివరాల ప్రకారం.. కొరిపల్లికి చెందిన బొడ్డు లత ఈ నెల 20న బొజ్జ ఐశ్వర్యను భోజనానికి పిలవగా ఆమెతో పాటు మరో ఐదుగురు కలసి కారులో లత ఇంటికెళ్లారు. భోజనాలు చేస్తుండగా లత తమ్ముడు భార్య పెంకే దేవి అక్కడకెళ్లి, లతను బయటకు రమ్మని పిలిచి ఆమెతో అసభ్యకరంగా మాట్లాడి, ఘర్షణ పడ్డారు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన పెంకే గణేష్ మరో ఆరుగురితో కలసి వచ్చి లతను, క్రిస్టి జాస్మిన్‌ను కొట్టి గాయపర్చారు. కారు అద్దాన్ని పగులకొట్టి, ఐశ్వర్య హ్యాండ్ బ్యాగ్ తీసుకెళ్లిపోయారు. ఆ బ్యాగ్‌లో రూ.35 వేలు, 8 గ్రాముల గోల్డ్ చైన్ ఉన్నట్టు, తమను గాయపరచినట్టు లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అదే విధంగా తాను ఇంట్లో నిద్రిస్తుండగా అదేరోజు రాత్రి 9.30 గంటలకు బొడ్డు లత, మరి కొంతమంది, కాకినాడకు చెందిన ఐశ్వర్య మరో నలుగురు మహిళలను తీసుకొచ్చి బయటకు లాక్కొచ్చి తనపై దాడి చేసినట్టు పెంకే దేవి ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సునీత తెలిపారు.

సెల్‌టవర్ వద్దంటూ నిరసన



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గుడివాడ ప్రజలు

పెద్దాపురం: అనుమతులు లేకుండా ఇళ్ల మధ్య చేపడుతున్న సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలంటూ గుడివాడ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. తమ గ్రామంలో సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సాంకేతికతపై పట్టు సాధించాలి




గణితం, గణన సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సాంకేతికతపై పట్టు సాధించాలని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తి అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్, గణిత శాస్త్రం, ఎస్‌టీఎల్ టెక్నాలజీ విభాగం సంయుక్తంగా గణితం, గణన ఆవిష్కరణలపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన అంశాలు తెలుసుకోవాలన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ కంప్యూటర్ రంగం, గణిత శాస్త్రంలో మార్పులు, ఆధునిక పోకడలను విద్యార్థులు గుర్తించాలన్నారు. ఆదిత్య కళాశాల కార్యదర్శి సుగుణారెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ విభాగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, కృత్రిమ మేధాతో పాటు సాఫ్ట్‌వేర్ రంగానికి అవసరమైన కోర్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆదిత్య వర్సిటీ ప్రొఫెసర్ రామచంద్రమూర్తి, యూలెర్న్ సీఈఓ రామచంద్రమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీఓ తేజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవునికే టెండర్!

- రూ.45 వేలకే సత్రం దుప్పట్లు ఉతుకుతాం
- దేవస్థానం ఈఓకు స్థానిక రజకుడి దరఖాస్తు
- ప్రస్తుతం నెలకు రూ.60 వేల చెల్లింపు



అన్నవరంలో వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని సత్రాల గదులలో ఉపయోగించే దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లను నెలకు రూ.45 వేలకే ఉతుకుతామని స్థానిక రజక వృత్తి దారుడు కింతాడ శ్రీనివాస్ దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. నాలుగు నెలలుగా దేవస్థానం వీటిని నెలకు రూ.60 వేల చొప్పున చెల్లిస్తూ ఉతికిస్తోంది. ఎటువంటి టెండర్ పిలవకుండా ప్రజాప్రతినిధి సిఫార్స్ మేరకు నామినేషన్ మీద ఈ పని కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం ఈ అంశం చర్చనీయాంశమైంది.

గతంలో మెషీన్లతో..

దేవస్థానంలో రెండేళ్లపాటు పారిశుధ్య కాంట్రాక్ట్ నిర్వహించిన కేఎల్‌టీఎస్ సంస్థ గత ఫిబ్రవరి నెలాఖరు వరకు సత్రం గదులలో మంచాలపై వేసిన దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లను వాషింగ్ మెషీన్ల ద్వారా ఉతికించేది. పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్ట్ కోసం అన్ని దేవస్థానాలకు కలిపి టెండర్ పిలుస్తామని రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి సర్కార్ గత ఏడాది ఆగస్టులో ప్రకటించింది. ఆ మేరకు ఈ ఏడాది ఏప్రిల్‌లో తొలిసారిగా టెండర్ నిర్వహించారు. ఈ టెండర్ దరఖాస్తులో పొందుపరిచిన షరతులపై టెండర్‌దారులు అభ్యంతరం చెప్పడంతో ఆ నోటిఫికేషన్ రద్దు చేసి మరలా 13న టెండర్‌కు పిలిచారు. ఈ టెండర్లు ఖరారయ్యే వరకు దేవస్థానంలో పారిశుధ్య నిర్వహణను నామినేషన్‌పై గుంటూరుకు చెందిన కనకదుర్గా ఏజెన్సీస్‌కి అప్పగించారు. మూడు నెలలుగా ఆ సంస్థ 349 మంది సిబ్బందితో పారిశుధ్య నిర్వహణ చేస్తున్న విషయం, ఆ సిబ్బంది జీతాలు ఆలస్యమవుతున్న విషయం తెలిసిందే. గత మార్చి నుంచి సత్రాలలో దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లు ఉతికేందుకు గాను నాలుగు నెలలుగా నెలకు రూ.60 వేలు చెల్లిస్తున్నారు. అవి ఉతికేందుకు మెటీరియల్‌ను దేవస్థానమే అందజేస్తోంది. ఈ పని కూడా దేవస్థానం అధికారులపై ఒత్తిడి తెచ్చి టెండర్ పిలవకుండా కూటమి పార్టీ నాయకులే చేయిస్తున్నట్లు సమాచారం. కేఎల్‌టీసీ సంస్థ వాషింగ్ మెషీన్ల ద్వారా వీటిని ఉతికించేది. ప్రస్తుతం మనుషులు ఉతుకుతుండడంతో శుభ్రంగా ఉండడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.